



# తండ్రులూ - కొడుకులూ

-బొల్లిముంత నాగేశ్వరరావు

బ్రహ్మయ్య వింటున్నాడు. పక్కనే ఆయన భార్య పార్వతమ్మ కూడా ఉంది.

'...నిజం, నాన్నా! ఈ పనికి పనికిరాని డిగ్రీల మీద మనం వేలకు వేలు ఖర్చు చెయ్యటం శుద్ధ దండగ. ఇక్కడి విద్యాధికారులు ఈ దేశంలో ఏ విద్యకు ప్రాముఖ్యమివ్వాలో సరి అయిన అవగాహన లేని స్థితిలో ఉన్నారు. బి. ఏ. చదివి నేనేం చెయ్యాలి? ఎంప్లాయిమెంటు ఆఫీసులో రిజిస్టరు చేయించుకోవాలి. నాలుగైదు సంవత్సరాలు 'నిరుద్యోగిని, నిరుద్యోగిని' అంటూ వారికి గుర్తు చేస్తూ తిరగాలి. ఇంతా తిరిగితే ఒక చోట ఒక ఖాళీ ఉందంటూ వందమందిని పంపిస్తారు. ఉన్న ఒక్క ఉద్యోగమూ ఆ వందమందిలో ఎవరికి వస్తుందో తమకు తెలియని దేముంది, నాన్నా? వ్యాపారం సరుకు పాటలాగా అక్కడి అధికారులు ఆ ఉద్యోగానికి కూడా పాట పెడతారు. కొనగలిగిన వాడు కొనుక్కుంటాడు; లేనివాడు ఉస్సురుమంటూ వెనక్కు తిరిగి వస్తాడు. ముందు జరిగే ఆ వేలం పాటల్లో మనం ప్రతిసారీ వెనక్కు తిరిగి వచ్చే వారి లిస్టులోకే చేరతాం.

"ఈ చదువుల ధ్యేయం విజ్ఞానమే అయితే— జీవితంలో ఆర్థికంగా స్థిరపడ్డాక అయినా అవి చదువుకోవచ్చు. వేలకు వేలు ఖర్చు చేసి ఈ పిచ్చి తుగ్లక్ల చరిత్రల్ని నేను పాఠాలుగా కాలేజీల్లోనే చదవక్కర్లేదు. పాత పుస్తకాల గుట్టల్లోంచి బజార్లలో పాతిక పైసలకు కొన్నగా పుస్తకాల్లోంచి నేను వెలగ బెడుతున్న ఈ డిగ్రీ విజ్ఞానాన్ని సునాయాసంగా సంపాదించుకోవచ్చు. అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను. శివయ్య గారి మోటార్ షెడ్లో అప్రెంటీస్‌గా చేరతానన్నాను. వారందుకు అంగీకరించారు. ఈ రెండు సంవత్సరాలూ ఏదో కొంత ఇస్తామన్నారు. ఇది పూర్తి అయ్యాక ఒక ట్యాక్సీ డ్రైవర్ తీసుకుని ఏ బజారు మూల నిలబడ్డా ఆ రోజుకు బతక గలుగుతాను. విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో గొప్పవారి సందేశాల మధ్య డిగ్రీలను స్వీకరించిన వేలకు వేల మంది నిరుద్యోగులు ఇప్పుడెలా ఉన్నారో మీకు తెలియదా? విసిగిన చివరి క్షణాల్లో వారి జీవితాలు రైలు పట్టాల మీదా, లాడ్జి గదుల్లోనూ చివరి శ్వాసల్ని తీసుకుంటున్నాయి. అంతటి బలహీనమైన మానసిక స్థాయినీ, బ్రతుకలేని పిరికితనాన్నీ పరిస్థితుల్ని ఎదుర్కోలేని అవిటితనాన్నీ ఈ డిగ్రీల విజ్ఞానం వారికి ప్రసాదిస్తూంది! నేను తీసుకున్న ఈ నిర్ణయానికి మీ ఆశీర్వాదం కావాలి" అంటూ మురళి నిలబడ్డాడు. డిగ్రీలో మొదటి సంవత్సరం పూర్తి అయ్యింది. మార్కులు బాగా వస్తున్నాయి. తరగతిలో అతని మరుకుదనానికి లెక్చరర్లు, తోటి విద్యార్థులు అతనంటే ఎంతో ఇష్టంగా కూడా ఉంటున్నారు.

కానీ, మురళీ ఎందుకో హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. కొడుకు నిర్ణయం విని బ్రహ్మయ్యగారు కాస్సేపు మౌనం వహించారు. మురళి తల్లి మాత్రం ఆ మాటలు వినటంతోనే లబోదిబోమంటూ కాస్సేపు గోల చేసింది. పాలమ్మి పిడకలమ్మి తనెలాగో సంపాదిస్తూంది. ఆ సంపాదనా, మరికాస్త ఇంట్లో ఉన్నదీ మొత్తంగా కొడుకు చదువుకు వెచ్చించటం జరుగుతూంది. కొడుకు చదువుతున్నాడంటేనే తనకేదో గర్వం గానూ, తృప్తిగానూ ఉండేది. ఉన్న కూతురికి పెళ్ళి చేసి అత్తవారి ఇంటికి పంపారు. అల్లుడు చిన్న ఉద్యోగే అయినా కాస్త పెద్ద కట్నమే ఇచ్చుకున్నారు. రెండవవాడు హైస్కూలులో చదువుతున్నాడు.

కొడుకు చదువుతున్న పెద్ద చదువుకు అల్లుడు

లాంటి చిన్న ఉద్యోగం వచ్చినా ఎడమచేత్తో ఇచ్చింది, కుడిచేత్తో తీసుకోవచ్చు. కానీ హఠాత్తుగా వాడా నిర్ణయం తీసుకుని కార్లు తుడిచే కంపెనీలో చేరతానంటే ఆమె బావురుమని ఏడవాలని పించింది.

ఈలోగా బ్రహ్మయ్యగారు చిన్నగా నవ్వుతూ 'ఈ అభిప్రాయం నీకే కలిగిందా? ఎవరైనా కలగజేశారా?' అని మాత్రం అన్నాడు.

'ఇది నా స్వయం నిర్ణయం, నాన్నా!' మురళీ గట్టిగా సమాధానం ఇచ్చాడు.

బ్రహ్మయ్యగారు మరోకసారి మెల్లగా నవ్వి ఊరుకున్నాడు.

ఆయన కా సమయంలో తన చదువు కొనేటప్పుడు శివయ్య మాస్టారు చెప్పిన కథ ఎందుకో గుర్తు వచ్చింది.

* * * *

అనగనగా ఒక రాజు గారు. అందరు రాజుల మాదిరిగానే ఆయన కూడా దేశాన్ని పరిపాలిస్తున్నాడు. ఎండాకాలంలో ఎండా, వర్షాకాలంలో వాన, చలికాలంలో చలీ—అన్నీ మామూలుగానే ఉన్నాయి.

సైనికులు అడపా దడపా యుద్ధాలు చేసి చిన్న చిన్న రాజుల్ని చంపి వేస్తున్నారు. ఉద్యోగస్థులు తమ వంతు కర్తవ్యాల్ని నిర్వహిస్తున్నారు. పసిపిల్లలు బడులకు పోతున్నారు. ఉపాధ్యాయులు చదువులు చెపుతున్నారు.

కవులు కావ్యాలు వ్రాస్తున్నారు. గాయకులు కమ్మంగా పాడుతున్నారు. నటులు నాటకా లాడుతున్నారు. నర్తకులు నాట్యం చేస్తున్నారు.

ఇంకా ఇంకా అనేకులు అనేక విధాలుగా పనులు చెయ్యటానికీ, పట్టెడన్నం సంపాదించడానికీ దొరకటానికీ రైతులు నిత్యం శ్రమిస్తూ ఎండలో, వానలో, చలిలో కాలంల గడుపుతున్నారు.

ప్రజలందరూ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. దేశం శాంతి చక్రాల పరుగులు తీస్తూంది!!!

ఉన్నట్టుండి కాలం గతులు తప్పింది.

ఎండాకాలంలో వర్షాలు, వర్షాలు పడవలసిన సమయంలో ఎండలూ విపరీతంగా దర్శనమిచ్చాయి.

తన కాల మేదో తెలియక కోయిల వడగాడ్పుల్లో విలాప గీతాల్ని ఆలపించింది. చివరికి గొంతు తడి ఆరిపోయి దాని కమ్మని కంఠం బొంగురుపోయింది.

ఆ ఏడాది పంటలు పూర్తిగా పండలేదు.

వాతావరణం తోనూ, ఉత్పత్తితోనూ నిమిత్తం లేని రాజుగారి రెవిన్యూ అధికారులు పన్నుల వసూళ్ళకు బయలుదేరారు.

విధేయులైన జనం ఉన్నదంతా అమ్మి పన్నుల క్రింద జమ కట్టారు. ఖజానా, ప్రతి సంవత్సరం మాదిరిగానే భర్తీ అయిపోయింది. రాజూ, మంత్రీ ఖజానా చూడటానికి వచ్చారు.

మహామంత్రి మురిసిపోతూ రాజుగారికి చెప్పాడు.

''మహారాజా! మన ప్రజలెంత గొప్పవాళ్ళో ఒక్కసారి చూడండి. పంటలు పండకపోయినా, కరువులు వచ్చినా, కడుపులు మాడుతున్నా రాజుగారికి ఇవ్వవలసింది మాత్రం రాగి చెంబుతో సహా అమ్మి కట్టేశారు. ప్రభు భక్తి పరాయణత్వం వారిలో ఎంతగా ఉందో దీన్ని బట్టి రుజువు అవుతుంది. నిజమైన ప్రజలంటే వీరే. మన పరిపాలన సార్థకమయ్యింది, ప్రభూ!''

మహామంత్రి మాటలు వింటూ, మీసాలు దువ్వుకొంటూ ఆయన కాస్సేపు అలాగే ఉండిపోయాడు. ముఖంలో సంతోషం కానీ, విచారం కానీ ఏదీ కనిపించలేదు.

తన మంత్రిత్వాన్ని పొగుడుతా డను కున్న రాజు గారు మవునంగా ఉండి పోయేసరికి అమాత్యుల వారు కాస్త అయోమయంలో పడిపోయాడు.

వెళుతూ వెళుతూ రాజుగారు మాత్రం ఖజానా వంక చూసి ఒక పెద్ద నిట్టూర్పు వదిలాడు. ఆయన అలా ఎందుకు వదిలాడో మంత్రి గారికేమీ అర్థం కాలేదు.

మరుసటి సంవత్సరం కూడా పంటలు సరిగా పండలేదు. చెరువులు, దొరువుల్లో నీళ్ళు నిండలేదు. క్రిందటి ఏడు చేసిన అప్పులు తీరలేదు.



చిత్రం-కె.కుమార్

పక్షి రాబందుల రెక్కల క్రింద గంట గంటకూ కరిగిపోనున్న తాకట్టు వస్తువులు తెచ్చుకోలేదు.

జనమంతా ఇలా కష్టంగా, నష్టంగా ఉంటూ ఉన్న సమయంలో రాజుగారే ఈ సంవత్సరం భటుల్ని స్వయంగా పంపారు — పన్ను యథా విధిగా వసూలు చెయ్యండని!

భటులు విజృంభించారు. ఇంట్లో ఉన్న సామాన్లనూ, ఇంటి ముందున్న పశువుల్నీ మొత్తంగా తీసుకు పోవటం మొదలుపెట్టారు. జనం మెదలకుండా ఉండిపోయారు.

రాజధానికి దూరంగా రంగపుర మండలంలో మాత్రం జనమంతా ఒక్కుమ్మడిగా కర్రలూ, కత్తులూ తీసుకుని 'పన్నులు మేం కట్టలేం' అంటూ పోరాటం ప్రకటించారు. రాజుగారికి వార్త తెలిసింది. మండలాధీశులు పారిపోయి వచ్చారు. వెంటనే రాజుగారు మహామంత్రికి కబురు పెట్టారు. మరు క్షణంలో ఆయన వచ్చి నిలబడ్డాడు.

రాజుగారి ముఖంలో అవ్యక్తమైన ఆనందం తొంగి చూస్తూంది. ఆంతర్యం సెలవీయండంటూ అమాత్యుల వారు నిలుచున్నారు.

''మహామంత్రీ! సర్వ సైన్యాన్నీ సమాయత్తం చేసి రంగపురమండలానికి కదిలి వెళ్ళడానికి సిద్ధం చెయ్యి!''

''ప్రజలతో యుద్ధమా, ప్రభూ?' మంత్రి అడిగాడు.

'అవును.' ముక్తసరిగా రాజుగారు సమాధానం ఇచ్చారు.

రంగపురానికి కొంచెం దూరంలో విశాలమైన మైదానంలో సర్వసైన్యమూ సమాయత్త మయ్యింది.

తెల్లవారింది. ఎర్రగా సూర్యుడు పైకి వస్తున్నాడు. రాజుగారు అల్లంత దూరంలో జన సమూహాన్ని, వారి ముందుగా నడిచి వచ్చే ఒక మనిషిని చూశారు.

ఇప్పుడు ఆయన ముఖంలో మరింత ఆనందం కనుపించింది.

'మంత్రీ!'

'ఏమిటి, ప్రభూ?'

'అడుగో వస్తున్నాడు—రంగపుర మండలమంతటినీ పోరాటానికి సిద్ధం చేసిన మనిషి. మనిషి కదలికలో, నడకలో ఏ మాత్రం తడబాటూ కనిపించటం లేదు.'

'అవును, స్వామీ! అత డమరపుర విద్యాపీఠానికి ఆచార్యుడు. అపారమైన విజ్ఞానం అతనిసొత్తని జనం చెప్పుకుంటూరు.'

'అలాగా? అయితే రానీ. ఏం మాట్లాడతాడో విందాం.' రాజుగారి ముఖం మరింత సంతోషంతో వికసించింది.

ఆచార్యుడూ, అతని వెంట జనమూ రాజుగారికి దగ్గరగా వచ్చారు.

ఆచార్యుడు రాజు గారికి మరింత దగ్గరగా వచ్చాడు.

రాజుగారు ఆచార్యుణ్ణి పరిశీలనగా చూశారు. అలా పరిశీలనగా చూసేటప్పుడు ఆయన ముఖంలో ఇతరుల కర్థం కాని సంతోషం కనపడింది!

'ప్రభూ!' వినయంగానే ఆచార్యుడు వంగి నమస్కరించి అన్నాడు.

''ఏమిటి?'' రాజుగారు అన్నారు.

''ఈ ప్రజలు పన్నులు కట్టలేరు.''

''ఎందుకని?''

''వరసగా రెండు సంవత్సరాలు కరువు వచ్చింది. ఒక కరువులో మీరు వారిని ఆర్థికంగా దోపిడీ చేశారు. ఈ రెండవ కరువులో మీరు భటుల్ని పంపించి, వారికి మీ మీద ఉన్న భక్తినీ, ప్రేమనూ దోపిడీ చేశారు. ఇప్పుడు వారికి మిగిలింది—మీ మీద కసీ, కోపమూ, తిరుగుబాటు చెయ్యాలనే సంకల్పమూ.''

''ఇప్పుడేం చెయ్యాలంటావ్?''

''మరేం లేదు, ప్రభూ! ఈసారి మీ భటులు వారి దగ్గరికి వస్తే వారివ్వ గలిగినవి అవే.''

''ఏవీ — కసీ, కోపమూ తిరుగుబాటూ— అవే కదూ నాకు వాళ్ళిచ్చేది?''

''అవే, ప్రభూ!'' ఆచార్యుడు తొణకకుండా

సమాధానం ఇచ్చాడు.

రాజుగారు ముందుకు పోయి, ఆచార్యుణ్ణి ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

అక్కడి వారెవరికీ ఈ చర్య అర్థం కాలేదు. ఎదురు తిరిగిన ఆచార్యుడు వెంటనే చనిపోతాడని తలచారు. తరవాత జనాన్ని పిట్టల్లా మెడ కాయలు కోయిస్తాడనీ, వారంతా గుట్టలు పడి చనిపోతారనీ అనుకున్నారు.

ఈ మాత్రానికింత సైన్యాన్ని తీసుకు రావలసిన పని ఏమిటో అంతకంటే అర్థం కాలేదు.

అనూహ్యమైన పరిణామాన్ని అయోమయంగా తిలకిస్తున్న మంత్రుల, సామంతుల, సైన్యాధిపతుల వైపు తిరిగి —

"ఇదిగో, ఇటు చూడండి. రంగపుర మండలంలో నిజమైన ప్రజలు ఉన్నారు. ఈ ఆచార్యుడు మనదేశంలో మొదట పేర్కొదగిన వ్యక్తి!" అంటూ రాజుగారు పరమానందం చెందారు.

వెంటనే ఎన్నుల రద్దు తాఖీదునూ, ఖజానాలోని సొమ్మును అవసరమైన వాళ్ళకు పంచే తాఖీదునూ ఇచ్చి, అదంతా ఆచార్యుల వారి అజమాయిషీలో జరగాలన్నారు రాజుగారు. ఈ విషయంలో సహాయంగా సర్వసైన్యాన్ని వాడుకోమని అప్పజెప్పారు.

ఇప్పుడు రాజుగారికి ఎంతో తృప్తి మిగిలింది.

ఆయన మనసులో అనుకున్నారు:

'ఇప్పుడు నేను నిజమైన పాలకుణ్ణి. నిన్నటి వరకూ ఇంగితం ఎరుగని గొర్రెల్లాంటి జనాన్ని కాపలా కాశాను. ఇప్పుడు ప్రజల్ని పాలిస్తున్నాను. న్యాయ ధర్మాల కోసం నిలబడి, బ్రతుకు బాటలో పోరాడగల శక్తి సంపన్నులైన ప్రజలకు రాజుగా ఉండటం కంటే అదృష్టం మరొకటి ఎక్కడ ఉంటుంది? ఎదురు తిరిగిన వాళ్ళను నిర్దాక్షిణ్యంగ అణచటమే పరిపాలన అయితే — అదే, కర్కశుడైన సైన్యాధికారి నా కంటే ఎంతో మెలకువగా నిమిషాల్లో ముగించగలడు. అదీ ఎంతో కాలం సాగదు. అవతలి వైపు న్యాయమైన పోరాటం అయితే — ఆగ్రహించిన ప్రజలు చివరికి సహించలేక — శిలా శాసనం క్రిందికి సైన్యాధికారిని అతి త్వరలో పంపెయ్యగలరు.

సంక్లిష్టమైన సమయంలో వివేకపూరితమైన రాజరికం వారిని ఆదుకొంటే, అది నిజమైన పరిపాలన.

అన్యాయం జరిగేప్పుడు రాజునైనా ఎదిరించగలిగితే వారు నిజమైన ప్రజలు!

ఇప్పుడు నేను నిజమైన ప్రజలకు నిజమైన రాజును.'

* * *

"ఏమండీ! అలా వూరుకున్నారు? వాడు చదవనని అలా ఎదురు తిరిగితే మీరైనా దండిస్తారనుకున్నాను." పార్వతమ్మ కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

'పిచ్చిదానా! వాడింకా చిన్న పిల్లవాడనుకున్నావా? ఇక్కడి పరిస్థితుల్ని అందరిలా కాకుండా, మరోక రకంగా అర్థం చేసుకున్న ఒక మనిషి! ఈ పరిస్థితుల్లో మెలకువగ, ధైర్యంగ తన కాళ్ళమీద తను నిలబడి, కష్టాలనైనా సుఖాలుగా తలుస్తూ బతకగల ఒక నిజమైన కొడుకు! వాడికి తండ్రినైనందుకు ఎంతో గర్విస్తున్నాను, పార్వతీ! అది నీకు అర్థం కాకపోవచ్చు. వాడు తీసుకున్న ఆ నిర్ణయానికి నా చేయూత లభించినప్పుడు తండ్రిగా నేను వాడికి అర్థమవుతాను. ఎందుకంటే వాడు తీసుకున్న ఆ నిర్ణయంలో ఇప్పటివరకూ నాకు అర్థం కాని ఒక న్యాయం ఉంది.

'కాబట్టి ఇప్పుడు వాడిని కాలేజీకి పంపితే, ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించే శక్తి నాకు లేదు. ఉద్యోగం అంత తేలికగా రాదు. అందరూ ఎరిగిన నిజం అది.

'పార్వతీ! ఇప్పుడు మనం ఒక నిజమైన కొడుక్కు నిజమైన తల్లిదండ్రులం. వాడిని గురించిన బెంగ మనకు అక్కర్లేదు. వాడికి రెక్కలు వచ్చాయి. పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు ఈ పక్షి తన ముక్కును ఉక్కుగా మార్చుకుంది. రెక్కల్లో ఈటెల్ని మొలుచుకుంది. ఎగిరిపోతుంది. ఇకనేం భయంలేదు!'

కొడుకు వాగినట్లు తండ్రి కూడా గడగడా వాగుతూంటే అర్థం కాని పార్వతమ్మ అలాగే చూస్తూ ఉండిపోయింది. ★




ఇండెంటింగ్ ఏజంట్లు: (ఆంధ్ర ప్రదేశ్-ఉత్తరం) బాలాజీ టెక్స్‌టైల్ ఏజన్సీస్, 3-4-394 టొబేకో బజార్, సికిందరాబాదు 3.(ఆంధ్ర ప్రదేశ్-కోస్టల్)సంగం టెక్స్‌టైల్స్ ఏజన్సీస్, 230-డి.బి. రోడు, ఆర్‌ఎస్ పురం, కోయంబత్తూరు 2. ఎన్‌టైక్స్ గుడ్డలు అన్ని ఎన్.టి.సి. షోరూములలోనూ దొరుకును.